
**రూ. 14.13 లక్షల కోట్లు**
వచ్చే ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వ రుణ సమీకరణ లక్ష్యం



**బీజేపీ వీడ్కోలు బడ్జెట్**
ఇది బీజేపీ వీడ్కోలు బడ్జెట్. పదేండ్ల పాటు ప్రజా వ్యతిరేక బడ్జెట్లతో బీజేపీ సిగ్గుమాలిన రికార్డు సొంతం చేసుకొంది. అభివృద్ధికి పాటుపడని బడ్జెట్, ప్రజలకు ఉపయోగపడని అభివృద్ధి వ్యర్థం.
- అఖిలేశ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత

బడ్జెట్ 2024 25 2025

## 2024-25 మధ్యంతర బడ్జెట్




# పన్నులతో పిండేశారు!

## గత పదేండ్లలో మూడింతలైన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

### మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి


### సామాన్యులపై మోయలేనంత భారం.. ఉసూరుమన్న వేతన జీవులు

### 2024-25 ఆర్థిక సంవత్సర ట్యాక్స్ రెవెన్యూ లక్ష్యం రూ.38.31 లక్షల కోట్లు

మోదీ సర్కారు సామాన్యులను పన్నులతో పిండేసింది.

గత పదేండ్లలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు మూడింతలకు పెరిగాయని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనే ఇందుకు సాక్ష్యం.

ఈ దశాబ్దకాలం పేద, మధ్యతరగతి జేబులు నిల్.. ఖజానా ఫుల్ అన్నట్టు సాగింది మరి. మొత్తానికి సంక్షేమ పాలన అంటూ సగటు మనిషికి పన్ను పోటేసింది కేంద్ర ప్రభుత్వం.




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఎడాపెడా పన్నులతో విరుచుకుపడుతున్నది కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు. సామాన్యుల ముక్కుపిండిమరీ ఖజానాను నింపేసుకుంటున్నది. ఏటేటా ట్యాక్స్ రెవిన్యూ లక్ష్యాలను పెంచుకుంటూపోతూ పేద, మధ్యతరగతి వర్గాల నడ్డి విరుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల ముందు.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గురువారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తమ హయాంలో పన్ను వసూళ్లు భారీ ఎత్తున పెరిగాయని ప్రకటించారు. గడిచిన పదేండ్లలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు మూడింతలకుపైగా పెరిగినట్టు వెల్లడించారు. దీంతో బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజలపై పన్నుల భారం ఏ రీతిలో పడిందో చెప్పకనే చెప్పారు. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయని మొత్తుకున్నా పట్టించుకోని కేంద్రం.. పన్నులను పెంచుతూ సగటు మనిషి ఆశల్ని చిదిమేసిందన్న విమర్శలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

**కొత్త లక్ష్యం రూ.38.31 లక్షల కోట్లు**


వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) స్థూల పన్ను ఆదాయాన్ని రూ.38.31 లక్షల కోట్లుగా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అంచనావేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోల్చితే ఇది 11.46 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇక 2024-25లో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు 11.6 శాతం పెరగవచ్చని అంచనా. జీఎస్టీ కలెక్షన్స్ రూ.10.68 లక్షల కోట్లుగా నమోదు కావచ్చని భావిస్తున్నారు. ఈసారి కంటే ఇది రూ.1.1 లక్షల కోట్లు అధికం. 2023-24లో రూ.9.57 లక్షల కోట్లుగా జీఎస్టీ వసూళ్లు ఉంటాయని గత బడ్జెట్‌లో అంచనా వేశారు. మొత్తం రూ.38.31 లక్షల కోట్ల అంచనాలో ప్రత్యక్ష పన్నుల (వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేట్ ట్యాక్స్) వాటా రూ.21.99 లక్షల కోట్లుగా ఉండొచ్చని, పరోక్ష పన్నుల (కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, జీఎస్టీ) వాటా రూ.16.22 లక్షల కోట్లుగా ఉండొచ్చని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) కూడా బడ్జెట్ అంచనాను మించి స్థూల పన్నుల ఆదాయం దాదాపు రూ.76,000 కోట్లు ఎక్కువగా ఉండొచ్చని కేంద్రం భావిస్తున్నది. గత ఏడాది ఫిబ్రవరి 1న ప్రకటించిన బడ్జెట్‌లో స్థూల పన్ను ఆదాయాన్ని రూ.33.61 లక్షల కోట్లుగా అంచనా వేశారు. తాజా బడ్జెట్‌లో రూ.34.37 లక్షల కోట్లకు పెంచారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇంతకు సుమారు రూ.4 లక్షల కోట్లు పెంచి అంచనాలు వేయడం గమనించదగ్గ అంశం.

**పెరుగుతున్న వ్యక్తిగత ఐటీ వసూళ్లు..**

2023-24 బడ్జెట్ అంచనాల మేరకే కార్పొరేట్ ట్యాక్స్ కలెక్షన్స్ ఉంటాయనుకుంటున్నా.. వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు మాత్రం చాలావరకు పెరుగుతాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ అంచనాలకు మించి రూ.1.20 లక్షల కోట్లకుపైగా ఉండొచ్చని చెప్తున్నారు. కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాల వసూళ్లు కూడా ఈసారి రూ.2.19 లక్షల కోట్లకు, రూ.3.08 లక్షల కోట్లకే పరిమితం కావచ్చంటున్నారు. దీన్నిబట్టే పన్ను పరిధిలోకి ప్రజల్ని ఏ స్థాయిలో కేంద్రం తీసుకువస్తున్నదో అర్థం చేసుకోవచ్చంటున్నారంతా ఇప్పుడు. కార్పొరేట్ ట్యాక్స్, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలను కాదని, వ్యక్తిగత ఐటీ వసూళ్లపైనే కేంద్రం దృష్టి పెడుతున్నది మరి. ఇక 2014 నుంచి చూస్తే జీఎస్టీ వసూళ్లు రెండింతలైనట్టు ఆర్థిక మంత్రి చెప్తున్నారు. ఆయా వస్తూత్పత్తులపై పెరిగిన పన్నుల భారం, పన్ను పరిధిలోకి కొత్తగా తెచ్చిన వాటికి ఇది నిదర్శనంగా నిలుస్తున్నది.

### ఎఫ్‌డీఐకి తలుపులు బార్లా..

*విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు తలుపుల్ని మోదీ సర్కారు బార్లా తెరుస్తున్నది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు మరిన్ని దేశాలతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలను చేసుకోవడానికి ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు మరి. ఈ క్రమంలోనే 2014-23 మధ్య తమ ప్రభుత్వ హయాంలో దేశంలోకి 596 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చినట్టు ప్రకటించారు. గత యూపీఏ పాలన (2005-14)తో పోల్చితే రెట్టింపైనట్టు పేర్కొన్నారు. అయితే ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా అంటూ ఊదరగొట్టే కేంద్రం.. విదేశీ సంస్థలకు దేశీయ మార్కెట్‌ను ఇలా ఎఫ్‌డీఐల సాకుతో గంప గుత్తగా అప్పగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయిప్పుడు.*



**ట్యాక్స్ డిమాండ్లపై..**

2009-10 వరకు రూ.25,000దాకా ఉన్న వివాదాస్పద ప్రత్యక్ష పన్ను డిమాండ్లను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. 2010-11 నుంచి 2014-15 మధ్య వచ్చిన వివాదాస్పద ప్రత్యక్ష పన్ను డిమాండ్లలో రూ.10,000 వరకుండే వాటినీ వెనక్కి తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఈ నిర్ణయం కోటి మంది పన్ను చెల్లింపుదారులకు ఊరటనిస్తుందన్నారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవల్ని అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్న మంత్రి.. మిగతా డిమాండ్ల పరిష్కారానికీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


**స్టార్టప్‌లు, పెన్షన్ ఫండ్స్ కోసం..**

బడ్జెట్‌లో స్టార్టప్‌లు, పెన్షన్ ఫండ్స్ కోసం పన్ను ప్రోత్సాహకాలను పొడిగించారు. వచ్చే ఏడాది మార్చి ఆఖరుదాకా పన్ను మినహాయింపులు కొనసాగుతాయి. సావరిన్ వెల్త్ లేదా పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులపైనా ఇది వర్తిస్తుంది. అలాగే ఈ ఏడాది మార్చి 31తో గడువు తీరిపోతున్న కొన్ని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్‌ఎస్‌సీ) యూనిట్ల ఆదాయంపైనా పన్ను మినహాయింపులుంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఇప్పటిదాకా దేశంలో 1.17 లక్షల స్టార్టప్‌లను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఇందులో అర్హత ఉన్నవాటికి స్టార్టప్ ఇండియా యాక్షన్ ప్లాన్ కింద ఆదాయ పన్ను ప్రయోజనాలు, ద్రవ్యేతర ప్రోత్సాహకాల వంటివి అందుతాయని తన ప్రసంగంలో మంత్రి తెలియజేశారు.

### పన్ను రేట్లు/శ్లాబుల్లో మార్పుల్లేవ్

ఈసారి బడ్జెట్‌ను పన్నుల జోలికి వెళ్లకుండానే ముగించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అటు ప్రత్యక్ష, ఇటు పరోక్ష పన్నులలో ఎటువంటి మార్పులు చేయలేదని స్పష్టం చేశారు. దిగుమతి సుంకాలూ యథాతథమేనన్నారు. అయితే ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారి సంఖ్య మాత్రం 2013-14 నుంచి గమనిస్తే 2.4 రెట్లు పెరిగిందని చెప్పారు. ట్యాక్స్ రిటర్నుల ప్రాసెసింగ్ సమయం 10 రోజులకు తగ్గిందన్నారు. 2013-14లో ఇది 93 రోజులుగా ఉన్నట్టు గుర్తుచేశారు. దీనివల్ల ట్యాక్స్ రిఫండ్స్‌లో వేగం పెరిగిందని చెప్పుకొచ్చారు.

## డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం 50 వేల కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న మోదీ సర్కారు.. మరో అడుగు ముందుకేసింది. పీఎస్‌యూల్లో వాటాలను విక్రయిస్తున్న కేంద్రం.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లోనూ వీటిని వదలడం లేదు. ఏకంగా 2024-25లో పీఎస్‌యూల్లో వాటాల విక్రయంతో రూ.50 వేల కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ ఏడాది మాత్రం రూ.30 వేల కోట్లు రావచ్చునని అంచనావేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఆర్‌వీఎన్‌ఎల్, ఐఆర్‌ఈడీఏలతోపాటు మరో మూడు సంస్థల్లో వాటాలను విక్రయించడంతో రూ.12,504 కోట్ల నిధులు సమకూరాయి. వచ్చే నెల చివరినాటికి డిజిన్వెస్ట్‌మెంట్ 30 వేల కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నది.

**లక్ష కోట్లు డివిడెండ్లు**

నిధులు లేక సతమతమవుతున్న కేంద్ర ప్రభుత్వం డివిడెండ్లపై కన్నేసింది. రిజర్వు బ్యాంక్, ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థల నుంచి డివిడెండ్ల రూపంలో రూ.1.02 లక్షల కోట్ల మేర నిధులు సమకూరవచ్చునని వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గతేడాది బడ్జెట్‌లో రూ.48 వేల కోట్లు అంచనావేసినప్పటికీ రూ.1.04 లక్షల కోట్లకు పైగా ఆర్జించింది.

## 5.1 శాతానికి ద్రవ్యలోటు కట్టడి!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రజాకర్షక విధానాలను పక్కనపెట్టి సమర్పించిన బడ్జెట్‌లో కేంద్రం సహజంగానే ద్రవ్యలోటును కట్టడి చేస్తూ ప్రతిపాదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 5.1 శాతానికి, 2025-26లో 4.5 శాతం లోపునకు తగ్గిస్తామని ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. అలాగే ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం ద్రవ్యలోటు 5.8 శాతానికి పరిమితమవుతుందన్నారు. దీనిని నిరుడు బడ్జెట్లో 5.9 శాతంగా ప్రతిపాదించారు. 2024-25 బడ్జెట్లో నామినల్ జీడీపీ రూ.3.27,71,808 కోట్లుగా బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. పన్ను వసూళ్లు పెరిగినందున ద్రవ్యలోటును గత బడ్జెట్ అంచనాలకంటే తగ్గించుకోగలుగుతున్నట్టు మంత్రి వివరించారు. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఆర్‌బీఎం) చట్టం మేరకు 2025-26 సంవత్సరానికల్లా ద్రవ్యలోటును 4.5 శాతం లోపునకు తగ్గించాలన్నది ప్రభుత్వం రోడ్‌మ్యాప్. ఇందుకు అనుగుణంగా 2024-25లో ఇది 5.1 శాతానికి తగ్గుతుందన్న అంచనాల్ని సీతారామన్ ప్రకటించారు. పరిమాణం రీత్యా చూస్తూ 2023-24లో సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత సంవత్సరంలో ద్రవ్యలోటు అంచనా 17,34,773 కోట్లుకాగా, వచ్చే ఏడాది రూ. 16,85494 కోట్లకు దిగివస్తుందని తాజా బడ్జెట్లో అంచనా వేశారు. అలాగే రెవిన్యూ లోటు ప్రస్తుత ఏడాది 1.8 శాతానికి, వచ్చే ఏడాది 0.8 శాతానికి తగ్గుతుందని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు.

## కార్పొరేట్లకు వ్యవసాయం తాకట్టు

### రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పలు రైతు సంఘాలు ఆరోపించాయి. గురువారం ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.2,22,281 కోట్ల నిధులు కేటాయించినట్టు ప్రకటించినా.. వాస్తవంగా కేటాయించింది రూ.1,17,528.79 కోట్లు మాత్రమేనని సంఘం ప్రతినిధులు ఆరోపించారు. కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 3న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చింది.

## ఇండస్ట్రియల్ కారిడార్లకు దక్కని చోటు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నమస్తే తెలంగాణ): ఇండస్ట్రియల్ కారిడార్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే తెలంగాణకు మరిన్ని పరిశ్రమలు వచ్చే ఆస్కారం ఉండగా, తాజా పరిణామాలతో వీటి కోసం మరికొంతకాలం వేచిచూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. మధ్యంతర బడ్జెట్‌లో కారిడార్ల ఊసేలేదు. రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు ఉండటంతో ఎలాగైనా ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ సర్కారు ఎప్పుడో ప్రతిపాదించింది. ఇందులో నాగపూర్-హైదరాబాద్, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ కారిడార్లున్నాయి. నాగపూర్-హైదరాబాద్‌కు గతంలోనే కేంద్రం ఆమోదం తెలిపినప్పటికీ తుది అనుమతులు రావాల్సి ఉన్నది. కాగా, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ కారిడార్లకు ఇంతవరకు కేంద్రం నుంచి ఎటుంటి అనుమతి రాలేదు. నిజానికి అనేకసార్లు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కేంద్రానికి రకరకాలుగా విజ్ఞప్తి చేసింది. అయినా.. తెలంగాణపట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వీటికి అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తూ వచ్చింది. ఇప్పుడు బడ్జెట్‌లోనూ చుక్కెదురైంది.

# భరోసాలేని బడ్జెట్..!

- సామాన్యులకు, ఉద్యోగులకు ఊరట లేదు
- పీఎం కిసాన్ సాయం పెంచలేదు.. రైతుల ఆదాయం డబుల్‌పై మాటే లేదు
- డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించే ప్రయత్నం చేయలేదు
- ఎప్పటిలాగే తెలంగాణకు మొండిచేయి
- కేంద్ర బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ ఎంపీలు కేకే, నామా విమర్శలు




హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నమస్తే తెలంగాణ): ఎన్నికల వేళ ప్రచారం చేసుకొనేందుకు బడ్జెట్ ప్రసంగాన్ని వాడుకున్నారేగానీ.. దేశ ప్రజల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా అందులో లేదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్ష నేత కే కేశవరావు, లోక్‌సభలో బీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై వారు గురువారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. పూర్తిగా నిరాశ, నిస్పృహలతో కూడుకున్న బడ్జెట్‌గా అభివర్ణించారు. బడ్జెట్ ప్రసంగం సొంత డబ్బాలా ఉన్నదని, ఏ వర్గాన్నికూడా సంతృప్తిపర్చలేదని విమర్శించారు. ఆశలు రేకెత్తించే బడ్జెట్ ప్రవేశపెడతారని భావిస్తే.. నిరాశలోకి నెట్టే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఒక్క కొత్త సంక్షేమ పథకం కూడా బడ్జెట్‌లో ప్రస్తావించలేదని అన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పతాక స్థాయికి చేరుకున్నాయని, వాటిని నియంత్రించే దిశగా బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావని లేదని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే ప్రణాళికేది లేదని, ఉద్యోగాల ప్రస్తావని జాడే లేదని, రైతులు, వ్యవసాయానికి కూడా ఉపయోగపడే విషయాలేవీ బడ్జెట్‌లో లేవని విమర్శించారు. మధ్యంతర బడ్జెట్‌లో సామాన్యులకు, ఉద్యోగులకు ఎలాంటి ఊరట లేదని, పన్నుల విషయంలోనూ ఎలాంటి మార్పు లేదని చెప్పి అన్ని వర్గాలను ఉసూరుమనించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయ పన్నుకు సంబంధించి స్టాండర్డ్ డిడక్షన్ సవరణ చేయలేదని, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సవరణ చేస్తారని ఐదేండ్ల నుంచి ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈసారికూడా వారికి నిరాశే ఎదురయ్యిందని విచారం వెలిబుచ్చారు. గత పదేండ్లలో ప్రత్యక్ష పన్నుల రాబడి మూడింతలు పెరిగినట్టు చెప్పారని, ఆ రాబడిని పేదల సంక్షేమం కోసం ఖర్చు చేసేందుకు మోదీ ప్రభుత్వం సుముఖంగా లేదని విమర్శించారు

**ఐదేండ్ల నుంచి 6 వేలే..**

పీఎం కిసాన్ సాయం పెంచుతారని రైతులు ఆశించారని, కానీ ఐదేండ్ల నుంచి రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. రైతుల ఖర్చులు పెరిగాయి.. పెట్టుబడి పెరిగింది.. ఆ మొత్తాన్ని పెంచుతారనుకుంటే రైతులకు నిరాశే ఎదురయ్యిందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి తక్కువ కేటాయింపులు (రూ.1.27 లక్షల కోట్లు) చేసి రైతులకు మొండిచేయి చూపారని మండిపడ్డారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యుడిపై భారం తగ్గించే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్‌లో రూ. 15 లక్షలు వేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని, అది ఇప్పటికీ అమలు కాలేదని ఎద్దేవా చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అందించే కవరేజీ రూ. 10 లక్షలకు పెంచుతారని పేదలు ఎదురు చూసినా ఫలితం లేకపోయిందని అన్నారు. ఎప్పటిలాగే తెలంగాణకు మరోసారి మొండి చేయి చూపారని పేర్కొన్నారు.

## తెలంగాణ రైళ్లకు మళ్లీ అన్యాయం

- ఏపీకి 9,138 కోట్లు.. తెలంగాణకు 5,071 కోట్లు
- బడ్జెట్ కేటాయింపు ఏపీ కంటే 4,067 కోట్లు తక్కువ
- ఎంఎంటీఎస్ ఫేజ్ 2కు రాష్ట్రం నిధులు ఇవ్వాల్సిందే
- మీడియాకు వివరాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు రైల్వే ప్రాజెక్టుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం మళ్లీ అన్యాయం చేసింది. గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రైల్వేబడ్జెట్‌లో ఏపీలో రైల్వేల అభివృద్ధికి రూ.9,138 కోట్లు కేటాయించగా తెలంగాణకు రూ.5,071 కోట్లు మాత్రమే కేటాయించారు. తెలంగాణ కంటే ఏపీకి రూ.4,067 కోట్లు అదనంగా కేటాయించడం గమనార్హం. పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఢిల్లీలో మీడియాకు రైల్వేబడ్జెట్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009 నుంచి 2014 మధ్య కాలంలో ఉమ్మడి ఏపీకి రైల్వే బడ్జెట్‌లో రూ.886 కోట్లు మాత్రమే కేటాయించగా, నేడు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. తెలంగాణకు రూ.5,071 కోట్లు కేటాయించామని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో విద్యుద్ధీకరణ పనులు వంద శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. గత పదేండ్లలో వివిధ ప్రాంతాల్లో 414 ఫ్లైఓవర్లు, అండర్ పాసేజ్‌లు నిర్మించినట్టు వివరించారు.

**రెండు నెలల్లో చర్లపల్లి రైల్వే టెర్మినల్**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే నెల 31 నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ తెలిపారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనులు కూడా కొనసాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ నిధులు విడుదలైన తర్వాత ఫేజ్-2 పనుల్లో పురోగతి ఉంటుందని పేర్కొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి అండగా ఉంటాం!

### న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండియన్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పురోగాభివృద్ధికి సహకారం అందిస్తామని న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డీజే పాండియన్ అన్నారు. గురువారం ఆయన సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు, రాష్ట్రంలో శిక్షణ సంస్థల ఏర్పాటునకు సహకరించాలని, హాస్పిటళ్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఇరువురి మధ్య జరిగిన చర్చల్లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ప్రస్తావన కూడా వచ్చింది.

### మోదీ పాలనలో సొంతిల్లు ఓ పెద్ద కలే..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పదేండ్ల పాలనలో పేదల సొంతింటి కల నేరవేరలేదు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే వచ్చే ఐదేండ్లలో 2 లక్షల ఇండ్లు నిర్మిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు.
-పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖల మంత్రి

### రాష్ట్ర ప్రజలకు కేంద్రం ధోకా

కేంద్రం తెలంగాణకు మొండి చెయ్యి చూపింది. రాష్ట్ర విభజన సందర్భంగా పొందుపర్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించకుండా యాక్సిల్ అండ్ వీల్ అనే పరిశ్రమను స్థాపిస్తామని చెప్పడం కంటి తుడుపు చర్యే.
- కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

### నేతి బీరకాయలో నెయ్యెంత

ఈ బడ్జెట్‌లో సుందరమైన భాషతో అందమైన అబద్ధాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పన్ను వ్యవహారంలో కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. బడ్జెట్ అదేవిధంగా ఉన్నది.
- కే నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

### వేతన జీవులకు నిరాశే

కేంద్ర బడ్జెట్‌పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏమాత్రం సంతోషంగా లేరు. ఆదాయపు పన్ను రేట్లను సవరించకుండా, రాయితీలను పెంచకుండా వేతన జీవులను కేంద్రం మోసం చేసింది. ఉద్యోగులపట్ల కనికరం చూపని నిర్మలా సీతారామన్.. కార్పొరేట్లకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరంగా ఉన్నది.
- జంగయ్య, చావ రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

### ఐటీ మినహాయింపు పెంపు ఊసేలేదు

ఉద్యోగులు ఆశించిన ఒక్క వెసులుబాటుకూ కేంద్రం బడ్జెట్‌లో చోటు కల్పించకపోవడం దారుణం. మూడేండ్లుగా ఆదాయపు పన్ను పరిమితి రూ.10 లక్షలకు పెంచాలని గొంతెత్తినా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ బడ్జెట్ ప్రతిపాదనకు సవరణలు చేసి, పన్నుల భారం తగ్గించి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఉపశమనం కలిగించాలి.
- కటకం రమేశ్, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

### విద్యా రంగానికి మొండిచెయ్యి

మధ్యంతర బడ్జెట్ పూర్తిగా విద్యా రంగాన్ని, రాష్ట్ర విద్యార్థి లోకాన్ని విస్మరించింది. విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన ట్రిపుల్ ఐటీ, ఐఐటీ, ఐఐఎం, జిల్లాకో నవోదయ పాఠశాల గురించి బడ్జెట్‌లో లేకపోవడం బీజేపీ కక్షపూరిత తీరుకు నిదర్శనం.
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

## మహీంద్రా ఎక్స్‌యూవీ-400 ఈవీ



*దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా.. రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త ఈవీ ఎక్స్‌యూవీ-400ని పరిచయం చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ మాడల్ రూ.15.49 లక్షల నుంచి రూ.17.49 లక్షల గరిష్ఠ ధరతో లభించనున్నది.*